సాక్షి
వికారాబాద్
ఆదివారం । 19 । నవంబర్ । 2023



వ్యాపారంగా పాలిటిక్స్

ప్రస్తుత రాజకీయాలు వ్యాపార ముసుగు ధరించాయి. పదవులను అడ్డం పెట్టుకుని అందినకాడికి దోచుకుంటున్నారు. 10లో▸



మనోహర్‌రెడ్డికే మద్దతు

కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డికే మా మద్దతు ఉంటుందని వెల్ఫేర్ ఆఫ్ ఇండియా పార్టీ ప్రకటించింది. 10లో▸



ఆ పార్టీలను వెలేయండి

ముదిరాజ్‌లకు టికెట్ ఇవ్వని పార్టీలను వెలేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ కోరారు. 10లో▸

న్యూస్‌రీల్

సంక్షేమానికి పట్టం కట్టండి

- మహేశ్‌రెడ్డిని మరోసారి గెలిపించాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



కుల్కచర్ల మండలంలో ప్రచారం చేస్తున్న సునీతారెడ్డి

కుల్కచర్ల: సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న మహేశ్‌రెడ్డిని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి కోరారు. శనివారం కుల్కచర్ల, చాపలగూడెం, తిర్మలాపూర్, బిండెంగడ్డ తండా, చెరువు ముందలి తండా, ఇప్పాయిపల్లి, రాంపూర్, అనంతసాగర్, గోరిగడ్డ తండా, పుట్టపహాడ్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని కోరే బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

మరోసారి తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపితే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ పరిగి అభ్యర్థి, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, చౌడాపూర్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ నాగరాజు, నాయకులు రాజప్ప, హరికృష్ణ, కొండయ్య, సునంద, అంగూర్, శంకర్ నాయక్, రాజు, పద్మ, రవి, హన్మయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మాకు రాజకీయాలతో సంబంధం లేదు

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ తాండూరు అధ్యక్షుడు కమాల్




మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు టౌన్: ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్‌కు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని ఆ అసోసియేషన్ తాండూరు అధ్యక్షుడు కమాల్ అతర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తమ అసోసియేషన్ ముస్లింల సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకున్నదని అన్నారు. గతంలో అసోసియేషన్‌లో బాధ్యతలు నిర్వహించిన ఖుర్షీద్ హుస్సేన్ ఎన్నికల సందర్భంగా పలు రాజకీయ పార్టీలకు అసోసియేషన్ మద్దతు ఉంటుందని చెప్పుకోవడం సరికాదన్నారు. వ్యక్తిగతంగా ఆయన మద్దతు ఎవ్వరికైనా ఇవ్వొచ్చని, అయితే అసోసియేషన్ పేరు చెప్పి సమావేశాలు నిర్వహించడం సరికాదన్నారు. అసోసియేషన్ భవనానికి వక్ఫ్ బోర్డుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అది ప్రజాప్రతినిధుల సహకారంతో సొంతంగా నిర్మించుకున్నదని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఖయూమ్ అతర్, ఉపాధ్యక్షుడు పాషా ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

స్టార్ క్యాంపెయినర్లు

అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రముఖుల ప్రచారాలు

- పోటాపోటీగా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు
- బీఆర్‌ఎస్ తరఫున కేటీఆర్
- కాంగ్రెస్ గెలుపుకోసం రేవంత్‌రెడ్డి
- 22, 23 తేదీల్లో సీఎం కేసీఆర్ పర్యటనలు
- త్వరలో రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే పర్యటించే అవకాశం



వికారాబాద్: ప్రచారానికి మరో పది రోజులే సమయం ఉండటంతో స్టార్ క్యాంపెయినర్ల దృష్టి వికారాబాద్ జిల్లాపై పడింది. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో ఆయా పార్టీల అగ్రనేతలు రంగంలోకి దిగుతున్నారు. జిల్లాలో ప్రధానంగా కాంగ్రెస్ – బీఆర్‌ఎస్ పార్టీ మధ్యే పోటీ ఉంది. మూడోసారి అధికారంలోకి రావాలని బీఆర్‌ఎస్ సర్వశక్తులు ఒడ్డుతోంది. అధికార పార్టీని ఎలాగైనా సరే ఓడించాలనే పట్టుదలతో కాంగ్రెస్ ఉంది. ఈ రెండు పార్టీల అభ్యర్థులు అధినేతలు, స్టార్ క్యాంపెయినర్లను రంగంలోకి దించుతున్నారు. అధినేతలతో సుడిగాలి పర్యటనలు చేయిస్తున్నారు. ఇప్పటికే గులాబీ దళపతి కేసీఆర్ జిల్లాలో పర్యటించనున్న తేదీలు ఖరారయ్యాయి. ఈ నెల 22, 23 తేదీల్లో ఆయన జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా జిల్లాలో పార్టీ ముఖ్యులను రంగంలోని దించుతున్నారు.

సుడిగాలి పర్యటనలు

ఈ నెల 28 ఎన్నికల ప్రచారం ముగియనుండడంతో జిల్లాలో ప్రముఖుల పర్యటనలు ఊపందుకున్నాయి. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, కోస్గీ, మద్దూరు, దౌల్తాబాద్ మండలాల్లో రోడ్ షోలు నిర్వహించారు. ఇదే సమయంలో పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో పర్యటించారు. కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్తేజం నింపే ప్రయత్నం చేశారు. తాండూరు, పరిగి నియోజకవర్గ కేంద్రాల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సైతం పర్యటించారు. త్వరలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే సభలు నిర్వహించేలా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర శాఖ ప్లాన్ చేస్తోంది. ఇక అధికార బీఆర్‌ఎస్ సైతం పార్టీ ముఖ్య నేతలను రంగంలోకి దింపి ప్రచారం నిర్వహిస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాలోని వికారాబాద్, మర్పల్లి, కుల్కచర్ల, కొడంగల్, కోస్గీ ప్రాంతాల్లో రోడ్ షోలు నిర్వహించారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సైతం వికారాబాద్ బహిరంగ సభలో పాల్గొని అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ముస్లిం మైనార్టీలను కోరారు. మరో ప్రధాన పార్టీ బీజేపీ తరఫున ఇప్పటి వరకు ప్రముఖులేవరూ ప్రచారం చేయలేదు. వారి ప్రచారం సాదాసీదాగా సాగుతోంది.

జన సమీకరణలో..

జిల్లాలో ఈ నెల 22, 23 తేదీల్లో సీఎం కేసీఆర్ సభలు ఉండడంతో భారీ జనసమీకరణకు అధికార పార్టీ అభ్యర్థులు ప్లాన్ చేస్తున్నారు. ఒక్కో సమావేశంలో 50 వేల నుంచి లక్ష మందిని తరలిస్తామని వారు అంటున్నారు. జిల్లాలో ఇప్పటికే నిర్వహించిన కేటీఆర్ రోడ్ షోలకు సైతం భారీగా జనసమీకరణ చేశారు. రేవంత్ రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సభలకు కూడా భారీగా జనాన్ని తరలించి సక్సెస్ చేశారు. త్వరలో జిల్లాలో కాంగ్రెస్ ముఖ్యులు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితరులు పర్యటించనున్న నేపథ్యంలో ఆ పార్టీ అభ్యర్థులు భారీగా జనాన్ని తరలించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపాలి

- అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వం
- ధరణి తెచ్చి రైతుల భూములు కాజేశారు
- కాంగ్రెస్ రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం
- వికారాబాద్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్



అంరాధికలాన్‌లో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: అవినీతిలో కూరుకుపోయిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పాత, కొత్త కోల్కుందలు, రావులపల్లి, అరాంధి కలాన్, కుర్దు, మేకవనంపల్లి, తండా, బూర్గుపల్లి, రాళ్లగుడుపల్లి, లచ్చానాయక్ తండా, కాస్లబాద్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి తెచ్చి రైతుల భూములను కాజేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే భూ భారతిని తెచ్చి రైతులకు సమస్యలు లేకుండా చూస్తామన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పడిన 100రోజుల్లో అమలు చేసి చూపిస్తామని పేర్కొన్నారు. రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్ ఇప్పటి వరకు సగం మంది రైతులకు కూడా అమలు చేయలేదని ఆరోపించారు. మా పార్టీ పగ్గాలు చేపట్టిన రోజే రూ. 2లక్షల రుణమాఫీపై తొలి సంతకం చేస్తుందని హామీ ఇచ్చారు. రైతులు, కౌలు రైతులకు రూ.15వేలు, రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి నెలా రూ.2500లు ఇస్తామన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని పేర్కొన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు రూ. లక్ష సాయంతోపాటు తులం బంగారం ఇస్తామని, అది కూడా పెళ్లి జరిగే రోజే అందజేస్తామని చెప్పారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బాగు పడిందని ఆరోపించారు. గ్రామాల్లో కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు నరోత్తంరెడ్డి, మహేందర్‌రెడ్డి, శుభాష్‌గౌడు, బాబు, సురేందర్, కరణం లక్ష్మీనారాయణ, బాగ్దాద్, ఒగ్గు మల్లయ్య, వేమారెడ్డి, సిరాజొద్దీన్, ఎజాస్ పటేల్, మహంత్ స్వామి, మల్లారెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

పోలింగ్‌కు సిద్ధంకండి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఫ్యాన్లు, నీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ధన్నారం, మండలంలోని పులుసు మామిడి, సిద్దులూరు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి, ఓటర్లుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఒక్కరికీ ఓటరు స్లిప్పులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ గైడ్, సీ విజిల్‌పై అవగాహన కల్పించే పత్రాలను ప్రజలకు అందజేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఎన్నికల అధికారులతో మాట్లాడారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరుగుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరికీ స్లిప్పులు అందజేయాలని ఆదేశించారు. ఈ నెల 22వ తేదీ నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఓటర్లు ఈ పిక్ కార్డు తోపాటు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. అర్హులు విధిగా ఓటు వేయాలని సూచించారు. అనంతరం బీఎల్‌ఓలకు ఓటరు స్లిప్పులు అందజేశారు.



దన్నారం పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఈవీఎంలపై అవగాహన అవసరం



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జనరల్ అబ్జర్వర్ సుధాకర్ జైస్వాల్

పరిగి: ఈవీఎం మిషన్లపై అవగాహన పెంచుకోవాలని జనల్ అబ్జర్వర్ సుధాకర్ జైస్వాల్ అన్నారు. శనివారం ఆర్‌ఓ కార్యాలయంలో వివిధ పార్టీ అభ్యర్థులు, ఏజెంట్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోటీ చేసే అభ్యర్థి, ఏజెంట్లు తప్పక అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ విజయకుమారి, తహసీల్దార్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఎల్లలు దాటించాలి

- హస్తం పాలనలో గోసపడ్డాం
- కేసీఆర్ హయాంలో రాష్ట్రం పురోగతి
- వరి సాగులో మనం రెండోస్థానం
- మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి
- బీఆర్‌ఎస్ వికారాబాద్ అభ్యర్థి ఆనంద్


మోమిన్‌పేట: తెలంగాణ రాక ముందు సాగునీటికి గోసపడ్డాం.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.. వరి సాగులో తెలంగాణ దేశంలోనే రెండోస్థానంలో నిలిచింది.. ఇది సీఎం కేసీఆర్ సాధించిన ఘనత.. అని బీఆర్‌ఎస్ వికారాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. ఇంత మంచి పాలన అందిస్తున్న బీఆర్‌ఎస్‌నే ఆదరించాలని కోరారు. శనివారం మండలంలోని సయ్యద్‌అల్లీపూర్, ఇజ్రా చిట్టంపల్లి, కేసారం, ఎన్కేపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు, రైతులు గోస పడ్డారని ఆరోపించారు. అలాంటి పార్టీని ఎల్లలు దాటించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాక ముందు, వచ్చిన తరువాత ఈ ప్రాంతం ఎలా ఉందో ప్రజలు చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. తాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు కోసం పొలాల వద్ద జాగారం చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు 24గంటల కరెంటు సరఫరా అవుతోందని వివరించారు. కరెంటు కావాలో కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు. పంటలు పండక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే కాంగ్రెస్ చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటోందని తెలిపారు. అన్నదాత ఆత్మహత్య చేసుకుంటే బాధిత కుటుంబానికి రూ.5లక్షలు ఇస్తోందని గుర్తుచేశారు. రైతు బంధు పథకం ద్వారా పంట సాగుకు పెట్టుబడి సాయం చేస్తోందని తెలిపారు. మరోసారి తనను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ సాధ్యం కాని హామీలు ఇస్తోందని ఆరోపించారు. కర్ణాటకలో గ్యారంటీలను అమలు చేయడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు సత్యనారాయణరెడ్డి, కాశీరాం, చంద్రకళ, అంతమ్మ, ఎంపీటీసీ కమిలిబాయి, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, మల్లయ్య, బాబు మియా, శ్రీనివాస్, నర్సింలు, అనూప్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇజ్రాచిట్టంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

ప్రచార పర్వం

జంగ్ తెలంగాణ



బషీరాబాద్ మండలంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న గిరిజన మహిళ



పరిగి పట్టణంలోని చాయ్ దుకాణంలో టీ తయారు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి



వికారాబాద్ అర్బన్: రామయ్యగూడలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



తాండూరులోని ఓ సెలూన్‌లో కటింగ్ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి



కుల్కచర్ల మండలంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

క్లుప్తంగా

ఓటర్‌ స్లిప్పుల పంపిణీ పూర్తి

ఆర్‌ఐ రాజిరెడ్డి

పెద్దేముల్‌: మండల పరిధిలోని 46 పోలింగ్‌ స్టేషన్లకు కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని బీఎల్‌ఓలకు ఓటర్‌ స్లిప్పులు పంపిణీ చేశామని పెద్దేముల్‌ ఆర్‌ఐ రాజిరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నేటితో ఓటర్‌ స్లిప్పుల పంపిణీ పూర్తయిందని చెప్పారు. ఆయా గ్రామాల్లోని ఓటర్లకు బీఎల్‌ఓలు ఈ పోల్‌ చిట్టీలు పంపిణీ చేస్తారని వివరించారు.

కాంగ్రెస్‌ గూటికి ఝూన్సీరాణి

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ జీహెచ్‌ఎంసీ మాజీ వార్డు సభ్యురాలు ఝూన్సీరాణి శనివారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ సమక్షంలో ఆమె రాజేంద్రనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరారు. ఝూన్సీరాణితో పాటు మహిళా నాయకురాళ్లకు కండువాలు వేసి పార్టీలోకి కస్తూరి నరేందర్‌ ఆహ్వానించారు. అనంతరం స్థానికంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు కే.ఎస్‌.దయానంద్‌, కోరని బాల్‌రాజ్‌, కోరని నరేందర్‌, స్వర్ణలత తదితరులున్నారు.

అహంకారంపై విజయం తథ్యం

అత్తాపూర్‌: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు అహంకారం ఆత్మ విశ్వాసానానికి మధ్య జరుగుతున్నాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా నాయకులు సుధాకర్‌ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి తరపున శనివారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయనకు అనుకూలంగా ప్రజలు స్పందిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌ గద్దె దిగడం ఖాయమని, అధికార పార్టీ ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి సానుకూల పవనాలు వీస్తున్నాయని, రాష్ట్రంలో డబుల్‌ ఇంజిన్‌ సర్కార్‌ రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు వెంకట్‌రెడ్డి, ఎం.విజయ్‌స్వామి, కొండకళ్ల కార్తీక్‌రెడ్డి, ఎస్‌.జిత్తుసింగ్‌, ఎం.సందీప్‌రెడ్డి, మిద్దెల రాజశేఖర్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, కె.అఖిలాష్‌రెడ్డి, శ్రీను, రమేష్‌, శివ, హేమంత్‌, రాముగౌడ్‌, ఓంకార్‌ తదితరులున్నారు.

రూ.10.50 లక్షలు సీజ్‌



పట్టుబడిన నగదుతో సీఐ. సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్‌: ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని పెద్దఅంబర్‌పేట ఔటర్‌ కూడలిలో ఏర్పాటు చేసిన చెక్‌ పోస్ట్‌ వద్ద శనివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.10.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్‌ చేసి, ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ మన్మోహన్‌ తెలిపారు.

వ్యాపారంగా పాలిటిక్స్‌

రాజకీయాలంటే హుందాతనం.. అది ఒకప్పటి మాట.. కాలక్రమేణా రూపు మారింది. తిట్ల దండకంతోనే కొంతమంది నేతలు పాలిటిక్స్‌లో పాపులర్‌ అవుతున్నారు. రాజకీయం నేడు వ్యాపారమైంది. దీంతో ప్రజల్లోనూ రాజకీయాలపై విశ్వాసం సన్నగిల్లుతోంది. తాజాగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాటి, నేటి రాజకీయాలపై ముదిరెడ్డి కోదండరెడ్డి తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

- నాయకులు ఓటర్ల విశ్వాసం కోల్పోతున్నారు
- ఏఐసీసీ కిసాన్‌సెల్‌ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి



1994 ఎన్నికల సందర్భంగా ముషీరాబాద్‌లో ముదిరెడ్డి కోదండరెడ్డి ప్రచారం

యాచారం: ప్రస్తుత రాజకీయాలు వ్యాపార ముసుగు ధరించాయి. వచ్చిన పదవులను అడ్డం పెట్టుకుని ప్రజాప్రతినిధులు దండిగా సంపాదించి వాటిని ఎన్నికల సమయంలో ఉపయోగిస్తూ.. కోట్లు ఖర్చు చేసి ఓటర్ల కొనుగోలుకు యత్నిస్తున్నారు. ప్రజల్లోనూ నాయకులపై విశ్వాసం సన్నగిల్లింది. నాడు ఓటర్లు సేవచేస్తారనే విశ్వాసంతో ప్రచారం చేసి నాయకులను ఎమ్మెల్యేలుగా గెలిపించేవారు. కానీ నేడు ఓటర్లు ఎన్నికలొస్తే నాయకులు ఏం ఇస్తారోనని ఎదురుచూస్తున్నారు, పోటీ చేసే నాయకులు సైతం రూ.కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడడం లేదన్నారు. ప్రస్తుత రాజకీయాలు చూస్తుంటే బాధేస్తుందని సీఎల్‌పీ మాజీ కార్యదర్శి, హుడా మాజీ చైర్మన్‌ ముదిరెడ్డి కోదండరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నత విద్య నుంచి రాజకీయాలకు..

యాచారం గ్రామానికి చెందిన ముదిరెడ్డి కోదండరెడ్డిపై చదువులకోసం హైదరాబాద్‌ నగరానికి వెళ్లారు. ఉన్నత విద్యలో ఉండగా ఇందిరాగాంధీ పాలనకు ముగ్ధుడై రాజకీయాలకు ఆకర్షితులయ్యారు. ఆయన యువజన కాంగ్రెస్‌లో చేరి నగరంలోని ముషీరాబాద్‌ నియోజకవర్గం నుంచి 1989 నుంచి 1999 వరకు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేశారు.

ఓటర్ల డబ్బుతోనే అసెంబ్లీ మెట్లెక్కా

1989, 1994 ఎన్నికల్లో ముషీరాబాద్‌ నియోజవర్గంలో జనతా పార్టీ నుంచి పోటీ చేసిన తెలంగాణ మాజీ హోంమంత్రి దివంగత నాయిని నర్సింహారెడ్డిపై కాంగ్రెస్‌ నుంచి రెండు పర్యాయాలు విజయం సాధించా. ఎన్నికలు వస్తే పార్టీ శ్రేణులే స్వచ్ఛందంగా తెల్లవారే వరకు ప్రచారానికి వచ్చేవారు. ప్రచారంలో ఓటర్లే చందాలు ఇచ్చే వారు. వారిచ్చిన చందాలు రూ.5లక్షల నుంచి రూ.8 లక్షలు ఖర్చు చేసి అసెంబ్లీ మెట్లెక్కా. వారిచ్చిన చందాలతో వాల్‌రైటింగ్స్‌, బ్యానర్స్‌, ఓటర్స్‌ స్లిప్పులకు డబ్బు ఖర్చయ్యేది. పోలింగ్‌ రోజు ఏజెంట్లకు టీ, భోజనం సమకూర్చేవారం. ఓటర్లు స్వచ్ఛందంగా ఓట్లేసి సమస్యలు తీర్చుకోవడంలో.. అభివృద్ధి పనులు చేయించుకోవడంలో అంతే డిమాండ్‌తో ఉండేవారు. అప్పట్లో ఉన్న కేంద్ర ఎన్నికల అధికారి టీఎన్‌.శేషన్‌ నిబంధనల వల్ల ఓటర్లల్లో చైతన్యం రావడంతో పాటు ఓటు హక్కు వినియోగంపై ప్రజలు ఆసక్తి చూపారు.

ఎన్టీఆర్‌ బాధపడిన తీరు మర్చిపోలేను

1994లో ఎన్టీఆర్‌ ప్రభజనంతో ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. తాను రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సమయంలో దివంగత పి.జనార్దన్‌రెడ్డి సీఎల్‌పీ లీడర్‌గా నేను సీఎల్‌పీ కార్యదర్శిగా ఎన్నికయ్యాం. కొద్ది నెల్లోనే చంద్రబాబునాయుడు వెన్నుపోటుతో సీఎంగా ఉన్న ఎన్టీఆర్‌ను పదవీ నుంచి దించేశాడు. ఆ సమయంలో ఎన్టీఆర్‌ బాధపడిన తీరు నేటికి మర్చిపోలేకపోతున్నాను.

1989లో మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఏడాదికే ఎన్‌.జనార్దన్‌రెడ్డి, మరో ఏడాదికే కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సీఎం అయ్యారు. ముగ్గురు సీఎంలకు సన్నిహితంగా ఉండేవాడిని. రెడ్డి కులస్తులు కేబినెట్‌లో ఎక్కువగా ఉండడంతో మంత్రి పదవికి బదులుగా హుడా చైర్మన్‌ పదవి వచ్చింది. దీంతో మహానగర అభివృద్ధి, డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం కృషి చేశా. ఎమ్మెల్యే హోదాలో ఉన్నప్పటికీ సెల్ఫ్‌ డ్రైవింగ్‌తో నియోజకవర్గంలో పర్యటించేవాడిని.

పోటీకి విముఖత

ఏఐసీసీ అధిష్టానం, ఇబ్రహీంపట్నం లేదా ముషీరాబాద్‌ నుంచి పోటీ చేయాలని కోరింది. కానీ ప్రస్తుత రాజకీయాలు తనలాంటి వారికి కష్టం. అందుకే అధిష్టానం ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. వైఎస్సార్‌ మరణం తర్వాత రాజకీయాలకు విలువ లేకుండా పోయింది. ప్రజలు నిజాయతీగా ఓటు హక్కు వినియోగించుకున్న నాడే ప్రజాస్వామ్యం రక్షించబడుతుంది.

వైఎస్సార్‌ అకాల మరణం.. రాజకీయ శాపం

వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి నేను ఎంతో సన్నిహితంగా ఉండే వారం. కాంగ్రెస్‌ను బతికించేందుకు వైఎస్సార్‌ ఎంతో కష్టపడ్డాడు. ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఆయనతో రాష్ట్రమంతా తిరిగేవాడిని. చిన్న బేదాభిప్రాయంతో రాజకీయంగా వెనుకబడిపోయా. 2009 రెండోసారి సీఎం అయ్యాకా అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చాడు. ఆయన మాటిచ్చిందు అంటే తప్పేవాడు కాదు. అందుకే ప్రజల్లో నేటికి వైఎస్సార్‌ దేవుడిగా మిగిలాడు. ఆయన అకాల మరణం తనకు రాజకీయ శాపంగా మారింది.



రైతు సదస్సులో వైఎస్సార్‌కు తలపాగా అలంకరిస్తున్న ముదిరెడ్డి కోదండరెడ్డి

మా మద్దతు మనోహర్‌రెడ్డికే..

- రాష్ట్ర వ్యాప్తంగా 26 ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు మద్దతు
- గోషామహల్‌లో నోటాకే మా ఓటు
- వెల్ఫేర్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్‌ వసీం



మాట్లాడుతున్న మహ్మద్‌ వసీం

తాండూరు టౌన్‌: కాంగ్రెస్‌ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డికే వెల్ఫేర్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా మద్దతు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్‌ వసీం ప్రకటించారు. శనివారం ఆయన పట్టణంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్న కాంగ్రెస్‌ పార్టీకే తమ మద్దతుంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 నియోజకవర్గాల్లో తమ పార్టీ శ్రేణులు కాంగ్రెస్‌ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తారన్నారు. గోషామహల్‌లో మాత్రం ఏ పార్టీకి తాము మద్దతివ్వడం లేదన్నారు. అక్కడ మా కార్యకర్తలు నోటాపై ఓటేస్తారన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా మేనిఫెస్టో విడుదల చేసిందని, ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ తాండూరు అధ్యక్షుడు ఇదాయత్‌ అలీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ పార్టీతో పాటు తనపై నమ్మకంతో మద్దతు ప్రకటించిన వెల్ఫేర్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరి ఆశీస్సులతో ఘన విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు అబ్దుల్‌ రవూఫ్‌, హబీబ్‌ లాలా, అబ్దుల్‌ రజాక్‌, ప్రభాకర్‌ గౌడ్‌, సమద్‌ తదితరులు పాల్గొన్నారు.

నోటా.. తూటా

- అభ్యర్థులు నచ్చకపోతే దీనికే ఓటు
- గెలుపోటములను శాసించే ఆయుధం
- ఫలితాలను తారుమారు చేసే అవకాశం

కొత్తూరు: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే అధికారాన్ని కల్పిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్‌ ఓటర్లకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఈవీఎం (ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ మెషిన్స్‌)లో బరిలో ఉన్న అభ్యర్థుల గుర్తుతో పాటు నోటా ఆప్షన్‌ను ఏర్పాటు చేసింది. పోటీలో ఉన్న అభ్యర్థులకు ఓటు వేయడం లేదు అనే ఆప్షన్‌ను ఈవీఎంలలో అభ్యర్థుల గుర్తుతో పాటు నోట అనే బటన్‌ను పొందుపర్చారు. ఆ బటన్‌ నొక్కితే ఓటు ఏ పార్టీకి పడదు. కానీ ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లే లెక్క.

గెలుపోటములపై ప్రభావం

నోటాకు పడే ఓట్లు తూటా కంటే బలమైనవిగా మారాయా..? అభ్యర్థుల ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయా..? అంటే అవుననే సమాధానం వస్తోంది. గతంలో పలు నియోజకవర్గాల్లో వెల్లడించిన ఫలితాల్లో నోటాకు పడే ఓట్లు గెలుపోటములను శాసించే శక్తిగా మారాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి తల్లోజు ఆచారిపై కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి కేవలం 78 ఓట్లతో గెలుపొందారు. నోటాకు 1,139 ఓట్లు పోలయ్యాయి. నోటాకు బదులు అభ్యర్థులకు ఈ ఓట్లు పోలై ఉంటే గెలుపోటముల ఫలితం మరోలా ఉండేది.

2018 ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్లు

- పరిగిలో మొత్తం 2,29,436 ఓట్లకు గాను 1,75,371 ఓట్లు అభ్యర్థులకు.. నోటాకు 1,381 పడ్డాయి. ఇక్కడ 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా ఆరుగురికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.
- తాండూరు నియోజకవర్గంలో 2,01,917 ఓట్లు ఉండగా అభ్యర్థులకు 1,56,436 ఓట్లు, నోటాకు 787 పోలయ్యాయి. 13 మంది పోటీ చేయగా ఏడుగురు అభ్యర్థులకు నోటాకు పడిన ఓట్ల కంటే తక్కువ పోలయ్యాయి.
- కొడంగల్‌ నియోజకవర్గంలో మొత్తం 2,01,941 ఓట్లకు గాను అభ్యర్థులకు 1,65,559, నోటాకు 1,472 పోలయ్యాయి. 15మంది అభ్యర్థులు పోటీ చేయగా పది మందికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.
- వికారాబాద్‌ నియోజకవర్గంలో మొత్తం 2,07,222 ఓట్లు ఉండగా 1,53,722 ఓట్లు అభ్యర్థులకు, నోటాకు 1,531 పోలయ్యాయి. 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా లేదు గురికి నోటాకు పోలైన ఓట్ల కంటే తక్కువ వచ్చాయి.
- చేవేళ్ల నియోజకవర్గంలో 2,24,230 ఓట్లకు గాను 1,77,197 ఓట్లు అభ్యర్థులకు, నోటాకు 1,469 పోలయ్యాయి. నియోజకవర్గం నుంచి పది మంది పోటీ చేయగా ఐదుగురు అభ్యర్థులకు నోటా కంటే తక్కువ పోలయ్యాయి.



సమావేశంలో మాట్లాడుతున్న షామ మహమ్మద్‌

ముదిరాజ్‌లకు టికెట్‌ ఇవ్వని పార్టీలను వెలేయండి

- మన ఓట్లను దొరల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టొద్దు
- తెలంగాణ ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌ ముదిరాజ్‌



సమైక్యతను చాటుతున్న ముదిరాజ్‌ కులస్తులు

తాండూరు టౌన్‌: ముదిరాజ్‌ కులస్తులకు టికెట్‌ కేటాయించని పార్టీలను వెలేయాలని తెలంగాణ ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్‌ ముదిరాజ్‌ పిలుపునిచ్చారు. శనివారం ఆయన పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ముదిరాజ్‌ కులస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌ కులస్తులకు పార్టీ బీఫాంలు ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముదిరాజ్‌ కులస్తులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా వారికి సంపూర్ణమద్దతిచ్చి గెలిపించాలని కోరారు. మన ఓట్లను తీసుకెళ్లి దొరల కాళ్ల దగ్గర పెట్టొద్దని సూచించారు. ముదిరాజ్‌ తల్లి రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని.. జాతి ప్రయోజనాలే ముఖ్యమని.. తాండూరులో బరిలో ఉన్న ముదిరాజ్‌ బిడ్డ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ముదిరాజ్‌ల సత్తా చాటాలంటే మన యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. ముదిరాజ్‌లు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్‌ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్‌, జగన్‌, నరేందర్‌, బాల్‌రాజు, కనకయ్య, గోపాల్‌, సంజయ్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ చేసేదే చెబుతుంది

- 100రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం
- ఏఐసీసీ అధికార ప్రతినిధి డాక్టర్‌ షమా మహమ్మద్‌

మోమిన్‌పేట: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఏది చెప్పిందో అది కచ్చితంగా చేసి తీరుతుందని ఏఐసీసీ అధికార ప్రతినిధి డాక్టర్‌ షమా మహమ్మద్‌ స్పష్టం చేశారు. శనివారం మండలంలోని బూర్గుపల్లి ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం పార్టీ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే కర్ణాటకలో ఐదు గ్యారంటీలను అమలు చేశామని గుర్తు చేశారు. ప్రతి నెలా మహిళలకు రూ.2500, ఉచిత బస్సు ప్రయాణం, వృద్ధులకు రూ.4వేల పింఛన్‌, రూ.500లకే వంట గ్యాస్‌ సిలిండర్‌ ఇస్తామని ప్రకటించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే పెట్రోల్‌, డీజిల్‌, గ్యాస్‌ ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రూ. 40వేల కోట్లతో పూర్తి కావాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టును రూ. 150కోట్లకు పెంచి భారీగా కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. అవినీతి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం రాగానే రూ.2లక్షల రుణమాఫీ, రూ.3లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తుందని తెలిపారు. ప్రతి ఇంటికీ 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ ఇస్తామన్నారు. కేసీఆర్‌ ప్రభుత్వం డబుల్‌ బెడ్‌రూం హామీని నిలుపుకోలేపోయిందని, కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇంటి స్థలంతోపాటు నిర్మాణానికి రూ. 5లక్షలు ఇస్తుందని తెలిపారు. ఆమె వెంట నాయకుడు లలిత్‌ తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

సైబరాబాద్‌ సీపీ స్టీఫెన్‌ రవీంద్ర

శంషాబాద్‌: వచ్చే 12 రోజులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ స్టీఫెన్‌ రవీంద్ర సూచించారు. నోడల్‌ అధికారులైన డీసీపీ, ఏసీపీలతో శనివారం శంషాబాద్‌ డీసీపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేయడంతో పాటు ప్రణాళికా బద్ధంగా శాంతిభద్రతలను పర్యవేక్షించాలన్నారు. అక్రమ మద్యం, నగదు పంపిణీల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలోని పోలింగ్‌ కేంద్రాలకు రూట్‌ మొబైలింగ్‌ను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ట్రాఫిక్‌ పోలీసులు పోలింగ్‌ కేంద్రాల వద్దకు రవాణా సాఫీగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. శంషాబాద్‌ డీసీపీ కె. నారాయణరెడ్డి, ట్రాఫిక్‌ డీసీపీ శ్రీనివాస్‌రావు, ఎలక్షన్‌ సెల్‌ డీసీపీ అశోక్‌కుమార్‌, అడిషనల్‌ డీసీపీలు రవికుమార్‌, రామ్‌కుమార్‌, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

డీసీపీ నారాయణరెడ్డి

కడ్తాల్‌: ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని శంషాబాద్‌ డీసీపీ నారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శనివారం రాత్రి మండల కేంద్రంతో పాటు, మైసిగండి గ్రామాల్లో పారా మిలటరీ, సీఐఎస్‌ఎఫ్‌, స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పోలింగ్‌ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ అమలులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా మద్యం, డబ్బు పంపిణీ చేస్తే నేరుగా తమకు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్‌ డీసీపీ రాంకుమార్‌, షాద్‌నగర్‌ ఏసీపీ రంగస్వామి, సీఐలు వెంకటేశ్వర్లు, శివప్రసాద్‌, ఎస్‌ఐలు హరిశంకర్‌గౌడ్‌, బలరాం, శ్రీనివాస్‌ పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

దీవించండి.. గెలిపించండి



కారు గుర్తుకు ఓటేయాలని కోరుతున్న రోహిత్‌రెడ్డి తల్లి, జెడ్పీటీసీ సభ్యురలు ప్రమోదిని

ఎన్నికల ప్రచారంలో భాగంగా తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డి గెలుపు కోసం తన తల్లి, వికారాబాద్‌ జెడ్పీటీసీ సభ్యురాలు ప్రమోదిని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. మరో సారి దీవిస్తే మీ కొడుకులా సేవ చేస్తాడంటూ ఓటు అభ్యర్థించారు. – యాలాల

యాదన్న చిందు.. ఓటర్లకు కనువిందు



అభిమానులతో కలిసి నృత్యం చేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు వినూత్న రీతిలో ఆకట్టుకుంటున్నారు. శనివారం మండల పరిధిలోని కొమరబండలో బీఆర్‌ఎస్‌ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య మహిళలతో కలిసి చిందేశారు. ఆయన వెంటనున్న నాయకులు సైతం ఉత్సాహంతో కదం కలిపారు. – షాబాద్‌

కాంగ్రెస్‌తోనే అందరికీ న్యాయం

- కసిరెడ్డిని గెలిపించుకుందాం
- ప్రజలు మార్పు కోరుకుంటున్నారు
- నుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్‌ పార్టీ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఐక్యత ఫౌండేషన్‌ చైర్మన్‌ నుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. మాడ్గుల మండలం దిల్వార్‌ఖాన్‌పల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్‌ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా రాఘవేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వివరించారు. అధికారంలో వచ్చిన వెంటనే గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ ప్రజలకు న్యాయం జరగడం లేదని భావించి.. ఆరు గ్యారంటీలను ప్రకటించారని తెలిపారు. నారాయణరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాఘవేందర్‌రెడ్డి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్‌, మాజీ సర్పంచ్‌ యాదయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, దళపతిగౌడ్‌, యాదయ్య, గోవర్ధన్‌, కిరణ్‌, శివగౌడ్‌, మంగయ్య, సయ్యద్‌ మీర్‌ భూపేశ్‌కుమార్‌, వేణురెడ్డి, వెంకటేశ్‌గౌడ్‌ పాల్గొన్నారు.

ప్రచారంలో మందా జగన్నాథం

ఆమనగల్లు పట్టణంలో నారాయణరెడ్డికి మద్దతుగా నిర్వహించిన ప్రచారంలో మాజీ ఎంపీ మందా జగన్నాథం పాల్గొన్నారు. కల్వకుర్తిలో కసిరెడ్డిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, మానయ్య, కృష్ణనాయక్‌, ఖాదర్‌, అప్పం శ్రీను, అలీం, శ్రీకాంత్‌, నాజర్‌, ఫరీద్‌, రహీం, కరీం, బాబా, మహేశ్‌ పాల్గొన్నారు. కసిరెడ్డి సతీమణి ప్రచారం ఆమనగల్లు మండలం మేడిగడ్డతాండలో శనివారం కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి మాధవి విస్తృతంగా ప్రచారం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో గడప గడపకూ తిరుగుతూ కసిరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎంపీపీ అనిత, కాంగ్రెస్‌ పార్టీ జిల్లా నాయకుడు రవీందర్‌నాయక్‌, మండల కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షుడు రాములు, నాయకులు మల్లేశ్‌, రాంజ్యానాయక్‌, పత్యానాయక్‌, సురేశ్‌నాయక్‌ పాల్గొన్నారు.